నమస్తే తెలంగాణ



## తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు

మొదటిపేజీ తరువాయి...

ఉంది. ఇంతలోనే గుర్తు తెలియని దుండగులు విగ్రహంపై కప్పి ఉంచిన ముసుగుకు నిప్పంటించారు. దీంతో విగ్రహం పాక్షికంగా కాలిపోయింది. సోమవారం ఉదయం స్థానిక బీఆర్ఎస్ నాయకులు గద్దల రమేశ్, గంగాధరి రాజయ్య, వెల్ది రంగారావు గమనించి మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, మాజీ జడ్పీటీసీ భూక్య మంగ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు సహా ముఖ్య నాయకులకు సమాచారం అందించారు. విగ్రహం దగ్గరికి చేరుకున్న నాయకులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని నీళ్లతో శుభ్రంగా కడిగి ఆ తర్వాత క్షీరాభిషేకం చేశారు. అనంతరం విగ్రహంపై మళ్లీ ముసుగు వేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నాయకులు.. తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



## సన్న ధాన్యం అవుట్ టర్న్‌పై తేల్చండి

### రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): సన్నధాన్యంలో బియ్యం అవుట్ టర్న్ రేషియోను తేల్చాలని రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అవుట్ టర్న్ తేల్చకుండా ముందుకెళ్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించింది. సోమవారం హైదరాబాద్ నగర శివారులో గణపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. వానకాలం ధాన్యంలో అవుట్ టర్న్ రేషియోను తేల్చిన తర్వాతే ధాన్యం దించాలని, ఇందుకోసం టెస్ట్ మిల్లింగ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. టెస్ట్ మిల్లింగ్‌లో ఎంత శాతం బియ్యం వస్తే అంత ఇస్తామని స్పష్టంచేశారు. ఇప్పటికే వానకాలం ధాన్యం దించుకోబోమని మిల్లర్లు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. రా రైస్ మిల్లర్లు సైతం అదే బాటలో నడుస్తున్నారు.

# కొండా అనుచరుల దౌర్జన్యకాండ

- తెలంగాణ భవన్ వద్ద హంగామా
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- నిలువరించిన గులాబీ శ్రేణులు
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు
- మంత్రి సురేఖపై అనుచిత పోస్టులు
- దుష్ప్రచారంపై కఠిన చర్యలు : మంత్రి సురేఖ
- వికృత చేష్టలను ఖండిస్తున్నా: హరీశ్‌రావు



తెలంగాణ భవన్ వద్ద సోమవారం దౌర్జన్యానికి దిగిన కొండా అనుచరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అనుచరులు బరితెగించారు. మంత్రిపై సోషల్‌మీడియాలో పెట్టిన అనుచిత పోస్టును బీఆర్ఎస్‌కు ఆపాదిస్తూ తెలంగాణ భవన్‌పై దాడికియత్నించారు. సోమవారం ఆరుగురు వ్యక్తులు నిరసన పేరిట బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట హంగామా చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏకంగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. షెడ్యూల్ ప్రకారం కేటీఆర్ ప్రెస్‌మీట్ ఉండడంతో అప్పటికే అక్కడికి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భవన్ నుంచి బయటకు వచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు వేరేచోట నిరసన తెలుపుకోవచ్చు కదా? ఇక్కడికెందుకు వచ్చారు? అని వారించే ప్రయత్నం చేశారు. మరింత రెచ్చిపోయిన మంత్రి సురేఖ అనుచరులు ఆఫీసులోనికి దూసుకెళ్లేందుకు మెయిన్ గేటు వద్దకు వచ్చారు. బూతులు తిడుతూ బీఆర్ఎస్ నాయకులపై దాడికి యత్నించారు. అప్పటి వరకు సంయమనం పాటించిన బీఆర్ఎస్ నాయకులు మంత్రి అనుచరులను అడ్డగించారు. పార్టీ ఆఫీసుపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా బీఆర్ఎస్ ఆఫీసు వద్దకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

### అసలేం జరిగిందంటే..

మంత్రి కొండా సురేఖ ఇటీవల మెదక్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు కలిశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మూడు రంగులు గల నూలుతో తయారు చేసిన మాలను మంత్రి మెడలో వేశారు. ఈ ఫొటోను ట్యాగ్ చేస్తూ కొందరు యువకులు సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారు. బీఆర్ఎస్‌కు చెందిన వారే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆక్షేపించారు. సోమవారం గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

### వికృత చేష్టలను ఖండిస్తున్నా: హరీశ్‌రావు

మంత్రి కొండా సురేఖకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత అని, వారి పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని ఏ ఒక్కరూ సహించరని సోమవారం ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. మంత్రి సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను బీఆర్ఎస్ పార్టీ అయినా, వ్యక్తిగతంగా తానైనా ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## భవన్ ముందు వాళ్లకేం పని



తెలంగాణ భవన్ ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలకేం పని. కాంగ్రెస్ నేతలు దిష్టిబొమ్మతో భవన్‌కు రావడం ఏమిటి? సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతూ.. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారు. యథారాజా తథా ప్రజా అన్నట్టు రేవంత్‌లాగే కాంగ్రెస్ కార్యకర్తలు అసభ్య భాషవాడుతున్నారు.

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



దాస్యం వినయ్‌భాస్కర్‌ను అరెస్టు చేస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

## అక్రమంగా వినయ్‌భాస్కర్ అరెస్ట్

- హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన
- మాపై దాడి చేసి మాపైనే కేసులా?: దాస్యం వినయ్

హనుమకొండ, సెప్టెంబర్ 30: బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించి హనుమకొండ నయీంనగర్ నాలా అభివృద్ధి పనులను బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులతో కలిసి శాంతియుతంగా పరిశీలిస్తుండగా.. కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా 'జై నాయిని రాజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డికి అడ్డెవడు' అంటూ నినాదాలు చేస్తూ.. బీఆర్ఎస్ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తోపాటు పార్టీ కార్యకర్తలపై జులుం ప్రదర్శించారు. కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ దాస్యం అక్కడే నిరసన తెలుపగా.. పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై వదిలారు. తన 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి గూండాల సంస్కృతిని ఎన్నడూ చూడలేదని, తెలంగాణలో కాంగ్రెస్ సర్కారుది ప్రజా పాలన కాదని, ప్రతీకార పాలనని దాస్యం ధ్వజమెత్తారు. పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని విమర్శించారు. తమపై దాడి చేసిన వారిని వదిలిపెట్టి పోలీసులు తమనే అక్రమంగా అరెస్ట్ చేయడం శోచనీయమని పేర్కొన్నారు. దమ్ముంటే పెద్దమ్మగడ్డ శ్మశానవాటిక గోడ కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించి, వెంటనే కూల్చిన గోడను నిర్మించి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ నాయకులపై దాడిని ఖండిస్తున్నా: రాకేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాలును స్వీకరిస్తూ.. హనుమకొండలోని నయీంనగర్ బ్రిడ్జిని పరిశీలించేందుకు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉన్న హనుమకొండలో స్వయంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డినే అత్యుత్సాహం ప్రదర్శిస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారని ఆరోపించారు. 9 నెలల కాంగ్రెస్ పాలనలో 2 నెలలు ఎన్నికల కోడ్‌కే పోయిందని, అప్పుడే ప్రపోజల్, టెండర్లు, నిధుల మంజూరు పనులు పూర్తి అయ్యాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో మాత్రమే ఎమ్మెల్యే తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాడని, ఒకసారి నిధులు మంజూరయ్యాక ఆ స్థానంలో ఎవరున్నా పనులు పూర్తిచేస్తారని తెలిపారు.

## మంత్రి ఉత్తమ్‌కు కేటీఆర్ పరామర్శ



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పరామర్శించారు. సోమవారం కొండాపూర్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి, ఇటీవల చనిపోయిన ఉత్తమ్ తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, కార్తీక్‌రెడ్డి, విజయ్‌కుమార్ ఉన్నారు.

## ప్రభుత్వం సిగ్గుపడాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆసరా పింఛన్లను విరాళంగా ఇచ్చి రోడ్లు వేయించుకోవాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలని కేటీఆర్ దుయ్యబట్టారు. వృద్ధులు దాతలుగా మారి సహాయం చేస్తే తప్ప రోడ్లు వేయలేని పరిస్థితి ఉంటే మీ పాలన ఎందుకు? అని ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన ఆసరా పింఛన్లు అవ్వ, తాతలకే కాదు చివరకు గ్రామ పనులకు కూడా ఆసరా అవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లు వేయడానికి కూడా ప్రభుత్వం దగ్గర నిధులు లేవా? అని ప్రశ్నించారు. మాజీ సర్పంచుల సంగతి సరే చివరకు పంచాయతీ కార్యదర్శులు కూడా అప్పులపాలు కావల్సిందేనా? అని ప్రశ్నించారు.

# ఎంపీ అనిల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎక్స్ నుంచి ఆ వ్యాఖ్యలను తొలగించాలి
- లేకుంటే పరువునష్టం దావా వేస్తా
- కాంగ్రెస్ ఎంపీకి హరీశ్‌రావు లీగల్ నోటీస్
- వ్యక్తిగత దాడుల్లో భాగమే:కార్తీక్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆనంద కన్వెన్షన్‌లో తనకు వాటాలున్నాయంటూ కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి గోబెల్స్ ప్రచారాలను ఆశ్రయిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గోల్కొండకోట, చార్మినార్‌లోనూ హరీశ్‌కు వాటాలున్నాయని అంటారేమోనని అసహనం వ్యక్తం చేశారు. అసత్య ఆరోపణలు చేసిన అనిల్‌కుమార్ యాదవ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, నిరాధారమైన ఆ వ్యాఖ్యలను సామాజిక మాధ్యం ఎక్స్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీస్ పంపించారు. అనిల్‌కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆయనపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఆనంద కన్వెన్షన్‌లో హరీశ్‌రావుకు వాటాలున్నాయంటూ ఎక్స్ వేదికగా ఎంపీ అనిల్ ఆరోపించారు. అక్రమ ఆస్తులను కాపాడుకొనేందుకు సామాన్యులను అడ్డుపెట్టుకుంటున్నారంటూ మరో వ్యాఖ్యను జోడించారు. దీనిపై హరీశ్‌రావు లీగల్ నోటీస్ ద్వారా స్పందించారు.

### కాంగ్రెస్ నేతలు పిచ్చివేషాలు మానుకోవాలి : కార్తీక్‌రెడ్డి

ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పీ కార్తీక్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనంద కన్వెన్షన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు భాగస్వామి అని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టులను ఆయన తప్పుపట్టారు. ఇది కాంగ్రెస్ వ్యక్తిగత దాడుల్లో భాగమేనని విమర్శించారు. ఆనంద కన్వెన్షన్‌తో హరీశ్‌రావుకు సంబంధంలేదని స్పష్టం చేశారు. ఆనంద కన్వెన్షన్‌ను కూలగొడితే అక్కడ జేసీబీకి ముందు కొబ్బరికాయ కొట్టేది తామేనని తెలిపారు. కాంగ్రెస్ నేతలు పిచ్చివేషాలు మానుకోవాలని హితవు పలికారు. హైడ్రాపై హైకోర్టు అక్షింతలు వేసిందని, ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలని సూచించారు.

### ఎంపీ అనిల్‌వి పిల్లచేష్టలు: దాసోజు శ్రవణ్

పార్లమెంట్ సభ్యుడు అయినా అనిల్‌కుమార్‌కు ఇంకా పిల్లాడి చేష్టలు పోలేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

## రుణమాఫీ చేయని రేవంత్ రాజీనామా చేయాలి



రామన్నపేట, సెప్టెంబర్ 30 : రుణమాఫీతోపాటు ఆరు గ్యారెంటీలను అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి గన్‌పార్క్ వద్ద ముక్కు నేలకు రాసి పదవికి రాజీనామా చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9న రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తానని ప్రగల్భాలు పలికి తొమ్మిది నెలలు గడిచినా మాఫీ చేయకుండా రైతులను మోసగిస్తున్నారని విమర్శించారు.

## రుణమాఫీ కోసం రైతుల ధర్నా



రుణమాఫీ చేయాలని సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి సొసైటీ కార్యాలయం ఎదుట రైతులు రాస్తారోకో చేపట్టారు. అంతకు ముందు సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు అధ్యక్షతన సొసైటీ కార్యాలయంలో జరిగిన మహాజన సభను అడ్డుకొని నిరసన తెలిపారు. పెంట్లవెల్లి సొసైటీ 499 మంది రైతులు రుణం తీసుకుంటే ఒక్కరికీ పైసా మాఫీ కాలేదని అన్నారు. -పెంట్లవెల్లి

## 1962 సేవలపై సర్కార్ నిర్లక్ష్యం

### మాజీ మంత్రి హరీశ్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకు కేసీఆర్ ప్రారంభించిన 1962 -సంచార పశు వైద్య వాహన సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు సైతం పొంది దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన గొప్ప కార్యక్రమాన్ని గాలికి వదిలేసి మూగజీవుల రోదనకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమవుతున్నదని విమర్శించారు. ఓ వైపు వాహనాల్లో మందుల కొరత కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మూగజీవుల ప్రాణాలు కాపాడాలనే సదాశయం నీరుగారిపోతున్నదని, మరోవైపు వాహన డ్రైవర్, డాక్టర్, ఇతర సిబ్బందికి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబ పోషణ భారంగా మారి ఆవేదన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి 1962 వాహనాల్లో మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

## 10లోపు సంపూర్ణ రుణమాఫీ చేయాలి

- లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తాం
- మాజీ ఎమ్మెల్యే సురేందర్

గాంధారి, సెప్టెంబర్ 30: రైతులకు రుణమాఫీతోపాటు ఇతర హామీలను అక్టోబర్ 10లోగా నెరవేర్చకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే సురేందర్ హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా గాంధారిలో కామారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారిపై సోమవారం మహాధర్నా నిర్వహించారు. రెండుగంటలకుపైగా కొనసాగిన ఆందోళనతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతులను దారుణంగా మోసం చేసిందని సురేందర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిందేనని రైతులు, అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతుభరోసా ఎకరాకు రూ.15 వేల చొప్పున ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

# రబీ వచ్చినా రైతుభరోసాఏదీ?

- వానకాలం ముగిసినా అందని పెట్టుబడి సాయం
- కమిటీలు, అభిప్రాయ సేకరణ పేరుతో హంగామా
- ఎన్నికలకు ముందు పెంచి ఇస్తామని పోజులు
- ఉన్నది ఊడగొడుతున్నారని రైతుల ఆగ్రహం
- 11 సీజన్లు నిర్విరామంగా ఇచ్చిన కేసీఆర్ సర్కారు
- రెండు సీజన్లకే కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు



రుణమాఫీ చేసి రైతుభరోసా అందించాలని సోమవారం వనపర్తి జిల్లా పెబ్బేరులో ఆందోళన చేస్తున్న రైతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం వానకాలం పంటల సాగు సీజన్ సోమవారంతో ముగిసింది. మంగళవారం నుంచి యాసంగి (రబీ) సీజన్ ప్రారంభమవుతున్నది. అయినప్పటికీ రైతులకు 'రైతు భరోసా' పెట్టుబడి సాయం పంపిణీ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. సీజన్ ముగిసినా రైతుభరోసా రాకపోవడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. ఎన్నికలకు ముందు రైతుభరోసాను పెంచి ఇస్తామని హామీలు గుప్పించి ఇప్పుడు ఉన్నది కాస్త ఊడగొడుతున్నారని రైతులు మండిపడుతున్నారు.

### పెంచి ఇస్తామని పోజులు

'రైతుబంధు కింద కేసీఆర్ ఏటా 10వేలే ఇస్తున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరుతో 15వేలు ఇస్తాం. కౌలు రైతులకు కూడా ఎకరాకు 15వేలు ఇస్తాం. రైతు కూలీలకు రూ. 12వేలు ఇస్తాం' అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు. కానీ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రైతుభరోసా సంగతి దేవుడెరుగు ఉన్న రైతుబంధును కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి, వానకాలం రెండు సీజన్లు పూర్తయ్యాయి. యాసంగి కోతల సమయంలో పాత పెట్టుబడిసాయం అందించి.. ప్రభుత్వం ఇప్పుడే వచ్చిందని, వానకాలం నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ మాట కూడా తప్పింది. ఇప్పటి వరకు పాత రైతుబంధు ఇవ్వలేదు... కొత్త రైతుభరోసా ఇవ్వలేదు. దీంతో రైతుల్లోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. చేతగానప్పుడు తప్పుడు హామీలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

### కమిటీలతో కాలయాపన

'గతంలో రైతుబంధు దుర్వినియోగం అయింది. రైతుభరోసాలో సమూల మార్పులు తీసుకొస్తాం. పంట వేసిన భూమికి, రైతుకు మాత్రమే పెట్టుబడి సాయం పంపిణీ చేస్తాం. ఇందుకోసం రైతులు, మేధావులు అభిప్రాయాల సేకరణకు మంత్రులతో కమిటీ వేస్తున్నాం. ఈ కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇవ్వగానే అసెంబ్లీలో చర్చించి రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ చేస్తాం.' ఇది జూలై 2వ తేదీన రైతుభరోసాపై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు సమయంలో ప్రభుత్వం చేసిన ప్రకటన. ప్రభుత్వం చెప్పిన గడువు దాటి రెండు నెలలు పూర్తయింది. ఇప్పటి వరకు మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చింది లేదు... అసెంబ్లీలో చర్చించిందీ లేదు.. రైతులకు రైతుభరోసా పంపిణీ చేసింది లేదు. కమిటీ ఏర్పాటు తర్వాత వారం రోజుల పాటు పలు జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి భారీ హడావిడి చేశారు. రైతులను మభ్యపెట్టేందుకు, కాలయాపన చేసేందుకే ప్రభుత్వం కమిటీ ఏర్పాటు, అభిప్రాయ సేకరణ పేరుతో డ్రామా ఆడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కేసీఆర్ నిర్విరామంగా

రైతులకు పెట్టుబడి గోసను తీర్చాలనే సంకల్పంతో నాటి సీఎం కేసీఆర్ రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ఎకరానికి ఏటా రూ. 10 వేల పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేశారు. ఈ విధంగా ప్రతి సీజన్‌లో సుమారు 65-70 లక్షల మంది రైతులకు రూ.7500కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. ఇలా పదకొండు విడతల్లో ఏకంగా రూ. 73వేల కోట్లను రైతులకు పెట్టుబడి సాయంగా అందించిన ఘనత కేసీఆర్ సర్కారు దక్కించుకున్నది. సుమారు ఐదున్నరేండ్లలో ఏ సీజన్‌లోనూ రైతులు రైతు బంధు కోసం ఇంతలా ఎదురు చూసే పరిస్థితి రాలేదు. చివరికి కరోనా కాలంలోనూ రైతులకు కేసీఆర్ సర్కారు టంచనుగా పెట్టుబడి సాయాన్ని అందించింది.

### భరోసా లేనట్టే..

వానకాలం సీజన్ పూర్తి కావడంతో రైతు భరోసా పెట్టుబడిసాయం పంపిణీపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కొత్త నిబంధనలు రూపొందించి, సర్వే చేసి, సాగు చేసే భూముల వివరాలు, రైతుల వివరాలు సేకరించి రైతుభరోసా ఇవ్వడం సాధ్యమయ్యే పని కాదని రైతులే తేల్చిచెబుతున్నారు. జూన్‌లో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం అక్టోబర్ వచ్చినా ఇవ్వకపోవడంతో ఈ సీజన్ రైతుభరోసాకు ప్రభుత్వం రాం రాం పలికినట్టేననే అభిప్రాయాలను రైతులు వ్యక్తంచేస్తున్నారు.

### రైతుబంధు ఊసే లేదు



కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు ఊసే లేదు. వానకాలం పంటల సాగు చేపట్టి నాలుగు నెలలు పూర్తయినా ఒక్క రూపాయి కూడా పడలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు డబ్బులు కచ్చితంగా పడ్డాయి. మరి ఇప్పుడు ఎందుకు వేయట్లేదో ప్రభుత్వం చెప్పాలి.

- గోవర్ధన్, కొణిజర్ల, ఖమ్మం జిల్లా

### 30 వేలు అప్పు తెచ్చిన



కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు ఇస్తే.. నేను రూ.30 వేలు అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. కేసీఆర్ ఉండగా ఏనాడూ అప్పు తెచ్చుకోలేదు. ఇప్పుడు మళ్లీ అప్పు కోసం షావుకారు దగ్గరకు పోవాల్సి వస్తోంది.

- భాస్కర్‌రావు, ఎం.వెంకటాయపాలెం, ఖమ్మం జిల్లా

### రైతులను ఇబ్బంది పెట్టొద్దు..



ప్రజా ప్రభుత్వమని చెప్పే సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదు. వానకాలం సీజన్ పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేయలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు వానకాలం మొదట్లోనే రైతుబంధు పడేది.

- బొడ్డు నర్సయ్య, చినబండిరేవు, భద్రాద్రి జిల్లా